# భేషజాల బంగారు సంకెళ్లు

యూరోపియన్ లేడీచేతిలో కాబూలీదానిమ్మ వంక ఆశగా, నిరాశగా, ఆబగా, ఆత్రంగా చూస్తున్నాడు తన గుడిసెముందు నర్సిగాడు.

ఆ యూరోపియన్ దంపతుల చర్మం తాలూకు ఎఱుపు, తెలుపుల మిశ్రమం వాడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తే, ఆమె చేతిలో ఎఱుపు, నలుపుల మిశ్రమంలో వాడి కంటికి చిత్రంగా వున్న కాబూలీదానిమ్మపండు వాడి నోటిని తడి చేస్తోంది.

ఆ టౌన్‌లో క్రొత్తగా అభివృద్ధి చెందుతున్న ఒక భాగంలో ఒకప్రక్క మేడలు, ఒక ప్రక్క గుడిసెలతోనున్న మట్టిరోడ్డులో ఏమి కొత్తదనం కన్పించిందో, కళ్ళింతింత చేసుకొని చూస్తూ, పెద్దగా మాట్లాడుకుంటూ వెళ్తున్న ఆ దంపతులకు ఏడేళ్ళ నరిసిగాడి ఆశానేత్రాలు చూడగానే చేతిలో దానిమ్మపండు భరించరానంత బరువుగా అన్పించింది కాబోలు, ఆగి సంజ్ఞ చేసి పిలిచి, వాడి నల్లటి మట్టి గొట్టుకు పోయిన చేతుల్లో పెట్టగానే, వాడి ఆనందానికి, ఆశ్చర్యానికి అంతులేకపోయింది. నాలుగడుగులు ముందుకేసి, వడివడిగా

వెళ్ళిపోతున్న యూరోపియన్ దంపతులకేసి కృతజ్ఞతగా చూస్తున్న నరిసిగాడి చేతిలో దానిమ్మపండును దుడుగ్గా లాక్కుంది, నరిసిగాడు ఈ భూమిమీద పడి ఆశగా ఆ పండు వంక చూడటానికి కారణభూతురాలైన రామి. "ఒసే! నాదీ ఆ పండు" అని ఆత్రంగా అమ్మమీద కెగబడ్డాడు నరిశిగాడు కృతజ్ఞత నిండిన కళ్ళను కన్నీళ్ళతో నింపుకుంటూ.

"ఒరే సన్నాసి ఎదవా! మనకెందుకురా ఇట్టాటివి - ఎన్నాళ్ళబట్టో అనుకుంటుండా, మా అమ్మగారికి ఇట్టాటిది ఏదైనా ఇవ్వాలని-మనల్ని ఎట్టా చూసుకుంటాదిరా ఆ తల్లి."

తను పనిచేసే ఒక మధ్యతరగతి ఇల్లాలి దయాగుణాన్ని తలుచుకుంటూ కృతజ్ఞత తెలియజేయటానికి ఇన్ని రోజులకు అవకాశ మొచ్చినందుకు ఉప్పొంగిపోతూ అంది రామి. తన చిన్నారి కొడుకు నరిసిగాడి కళ్ళల్లో ఉబికిన నీటిలోని నిరాశని దాని ఆనందంలో అది గమనించలేదు. ఆ పండును భద్రంగా ఒళ్ళో దాచుకుని ప్రక్క వీధిలోకి పరుగు తీసింది.

* * *

"అబ్బ! ఈ దానిమ్మపండు ఎంత బాగుందో! ఎన్నాళ్ళుగా అనుకుంటున్నానో, ఇలాటిది తింటే ఎలా ఉంటుందో అని" అంది బుట్టగౌనులో పనిగెట్టుకుంటూవచ్చిన పదేళ్ళ లలిత, అమ్మచేతిలో దానిమ్మవంక చూస్తూ. ఒక్క క్షణం జవాబు చెప్పలేదు శారదమ్మ, తర్వాత మెల్లిగా అంది.

"అది కాదే లలితా! మనం యీ పండు తినేస్తామనుకో - అయిపోతుంది. అంతే కదా. నువ్వే అప్పుడప్పుడు అంటావు కదా. మీ టీచరుకు మీ క్లాసుపిల్లలు అవీ యివీ తెచ్చిస్తుంటారని, టీచర్ వాళ్ళను ముద్దుపెట్టుకుంటారనీను. ఈ పండు తీసుకెళ్ళి మీ క్లాసుటీచరు మంజులా మేడమ్ కివ్వరాదూ!"

లలిత ఉత్సాహం ఒక్క క్షణంలో చప్పబడిపోయింది. కానీ మరలా తన చేతిలో పండు అందుకొని, తనను ముద్దు పెట్టుకోబోయే టీచర్ గుర్తొచ్చి లేని ఉత్సాహం తెచ్చుకొంది.

* * *

"అయితే యీ రోజు మరలా మనకి మొదటి రాత్రన్నమాట." అని జోక్ చేశాడు మంజుల భర్త రమణ ఆలోచిస్తున్న భార్య చేతిలో దానిమ్మవంక విలాసంగా చూస్తూ.

కానీ, వీధికొక కాన్వెంటుగా వెలుస్తున్న యీరోజుల్లో ఓ మారుమూల గుర్తింపు రాని కాన్వెంటులో అరవై రూపాయల కనీసపు జీతానికి క్రొత్తగా చేరిన మంజులా మేడమ్‌కి, పిల్లల దగ్గరనుంచి రోజూ పూలు, జామపళ్ళు, అరటిపళ్ళు లాటివి "ప్రజంటేషన్స" గా అందాయి కాని, ఖరీదయిన దానిమ్మపండును పొందడం ఇదే ప్రథమం. దానిని అందుకొంటున్న మొదటి క్షణంలోనే ఆమెకు మిస్ శైలీ గుర్తుకొచ్చింది. ఈ మధ్య ఆమె మాటలమధ్యలో తన స్టూడెంటు విద్య తనకు దానిమ్మపండు "ప్రజంట్" చేసిందని గర్వంగా

చెప్పుకున్న విషయం మంజుల మర్చిపోలేదు. ఆ గర్వంలో "నీ కింతవరకు ఏ స్టూడెంటూ దానిమ్మపండు ఇవ్వలేద" నే అంతర్గతమైన దెప్పిపొడుపు తాలూకు అవమానం ఇంకా మాసిపోలేదు. ఈ సారి 'ఫస్టు క్లాసు టీచర్' మిస్ లైలీ గర్వం అణచాలి.

ఆ రాత్రి తన అందమైన భార్య సుకుమారమైన చేతులలో గింజలుగా మారి దానిమ్మ తన అధరాల నందుకుంటుందని ఎదురు చూసిన రమణకి నిరాశే ఎదురైంది.

* * *

మర్నాడు ఉదయం పనిగట్టుకుని మిస్. లైలీ ఇంటికెళ్ళి ఆమె చేతిలో నలుపూ, ఎఱుపూ మిశ్రమంతో మెరుస్తున్న కాబూలీ దానిమ్మ ఉంచుతూ అంటోంది మంజుల.

"ఏమిటో లైలీ; పిల్లలకి అభిమానం మరీ జాస్తయిపోతోంది. దానిమ్మలు తిని తినీ, వెగటుపుడుతున్నాయి ఇదిగో ఇది లలిత ఇచ్చింది. మీ ఫాదర్ కివ్వు పాపం."

ఆ 'పాపం' అనే శబ్దం తాలూకు సానుభూతి వెనుక భావం; అతిక్రూరమైంది - కానీ ఆ గదిలో కర్టన్ అనబడే ఒక మాసిన గుడ్డ వెనుక, చిరిగిపోయిన దోమతెరలో శిథిలావస్థకి అభిముఖంగా నడుస్తున్న మంచంమీద మత్తులాటి నిద్రలో వున్న ముసలిప్రాణం - మిస్ లైలీ తాలూకు ఏక మాత్ర బంధువు - ఆమె తండ్రికి మాత్రం ఆ భావం బోధపడే అవకాశం లేదు. ఆ దానిమ్మ శబ్దమే అతనికి అతిమధురంగా సోకి లేచి కూర్చున్నాడు.

మంజుల మిస్ లైలీ భుజం సుతారంగా తట్టి. సంతృప్తిగా వీడ్కోలు తీసుకుంది, ఆ సంతృప్తిలో ఆమె రమణ నిరాశ తాలూకు అశాంతితో గడిపిన రాత్రి విషయం మర్చిపోయింది.

"మిస్ లైలీ నువ్వుకూడా దీనిని మరొకరికి ప్రజంట్ చేయాలనుకోవడం లేదుకదా!"

ఎల్లుండి క్రిస్‌మస్ పండుగ. ఈ పండును తమ ఫామిలీ డాక్టర్ రాజారావుకిస్తే బాగుంటుందా! లేక తన కాన్వెంటు అధిపతి మిస్టర్ దయానంద్ కిస్తే బాగుంటుందా! అని ఆలోచిస్తున్న మిస్. లైలీ ఉలిక్కిపడింది. మంజుల తమ్ముడు విజయ్ నవ్వుతూ నిల్చున్నాడు. "అక్కకోసం వచ్చాను. నీ చేతిలోకి వచ్చిన ఆ దానిమ్మను చూసి అలా అనకుండా వుండలేకపోయాను. అయామ్ సారీ." అతని మాటలలో క్షమాపణ కోరుతున్న ఉద్దేశం ఉన్నా, అతని పెదవులమీదమాత్రం చిరునవ్వు మాయం కాలేదు.

"నో, నో అలాంటిదేమీ లేదు. కానీ అలా ఎందుకన్నావు చెప్పు."

"ఏమీ లేదులే. ఈదానిమ్మ కథ నాకు కొంతవరకు తెలుసు. ఇంకొంత ఊహించగలను." అని మరలా సన్నగా నవ్వాడు.

"కథా!" మిస్ లైలీ ఆశ్చర్యంలో కుతూహలం కూడా వుంది.

"ఆఁ" అని ఆగి "వస్తా" అని వెనక్కి తిరిగిన విజయ్ చెయ్యి పట్టుకుంటూ అంది "ఓ విజయ్! ఈరోజు ఆ కథేమిటో వినకుండా నిన్ను పోనిస్తానేమిటి నేను." విజయ్ యీసారి నవ్వలేదు. అక్కడేవున్న కుర్చీలో కూర్చుంటూ నిట్టూర్చాడు.

"ఈ భేషజాల బంగారు సంకెళ్లు మన ఆకలిని ఎంతవరకు తీరుస్తాయా అని ఆలోచిస్తున్నాను. కథ అనికాదు శైలీ. జీవితంలో ఒక్క దానిమ్మపండు స్వయంగా కొనుక్కోలేని స్థితిలో వున్న మా అక్క మా బావ కోరికకూడా తిరస్కరించి దీనిని నీకు ప్రెజెంట్ చేసి తన "ప్రెస్టేజి" నిలబెట్టుకొంది. మా అక్కకు దీనిని ప్రెజెంట్ చేసిన లలిత కళ్ళల్లో తను దీనిని తినలేకపోయానే అనే బాధ నేను గమనించకపోలేదు. లలితకు కూడా యీ పండును ఇలాంటి "ఫాల్స ప్రెస్టేజ్" మైకంలో వున్న దౌర్భాగ్యులెవ్వరో ఇచ్చుండాల్సిందేకాని, వాళ్ళది ఐదు రూపాయలు పెట్టి దానిమ్మపండు కొనగల తాహతున్న కుటుంబము కాదని నాకు తెలుసు ఆ వెనుక కథను నేను ఊహించగలను." అని లేచి నిల్చుని,

"మీకివాళ ఎలావుంది అంకుల్" అని ఒక్కక్షణం ఆగి జవాబుకోసం ఎదురు చూశాడు. ఆ వృద్ధుడు ఇవేమీ విన్పించుకోవడం లేదు. ఆశగా ఆ పండువంక చూస్తున్నాడు. విజయ్ వాకిలివైపు ఒక్కడుగు వేశాడు. "డర్టీ రిక్షా! డర్టీ రిక్షా! కారు కొనమని" ఎన్నిసార్లు చెప్పినా తీరిక

లేదంటాడు డాడీ. చూడు అంకుల్," అంటూ మాకుడుగా వచ్చే విజయ్ కెదురుగా నిలబడి తన పొట్టిపావడాకి అంటిన దుమ్ము దులుపుకోసాగింది పదమూడేళ్ళ కవిత. ఆంగ్లో ఇండియన్ టీచర్ దగ్గర ట్యూషన్ అయితే అమ్మాయికి శాస్త్ర ఫారిన్ పద్ధతులు అలవడుతాయనే వుద్దేశ్యంతో ఒక నెలరోజులుగా ఆ అమ్మాయిని మిస్ లైలీ ఇంటికి పంపిస్తోంది లేడీస్ క్లబ్ సెక్రెటరీ - మిసెస్ మాధవరావు, ప్రాక్టీసు అంతగా లేని ప్రైయివేటు డాక్టరు. "తీరిక లేకపోవడమనే దాంట్లో చాలా అర్థముందమ్మా" అని వెనక్కు తిరిగి మిస్ లైలీవైపు అర్థవంతంగా చూస్తూ నవ్వాడు విజయ్. ఇంకా రిక్షామీద, రోడ్డుమీద విసుక్కుంటూనే లోపలికెళ్ళింది కవిత టీచర్‌ని విసుగ్గా విష్‌చేసి.

"ఆకలివల్ల జిహ్వా చాపల్యానికి బందీలయితే క్షమించొచ్చు కానీ లైలీ యీ భేషజాలకుమాత్రం కాదు. వెల్ అది ఇప్పుడు నీ స్వంతం. నీ ఇష్టం. కానీ ఒక్కసారి నీ తండ్రివైపుమాత్రం చూచి తర్వాత నీ ఇష్టంవచ్చినవాళ్ళ కివ్వు. వస్తా. బై-లైలీ."

లైలీ మిత్రుడి వీడ్కోలును అందుకునే స్థితిలో లేదు. ఆమె పరధ్యానంగా చేతిలో కాబూలీ దానిమ్మవంక చూస్తోంది.